అడవిదేవులపల్లిలో వరినాట్లు వేస్తున్న కూలీలు

ఊపందుకున్న వరినాట్లు

- మిషన్‌కాకతీయతో నిండుకుండల్లా చెరువులు
- సమృద్ధిగా భూగర్భ జలాలతో సంతోషంగా సాగు

అడవిదేవులపల్లి, డిసెంబర్ 9 : మండల కేంద్రంలో యాసంగి సీజన్‌లో వరినాట్లు జోరందుకున్నాయి. గత ప్రభుత్వం మిషన్ కాకతీయ పథకంతో చెరువులను బాగు చేయడంతో నీటినిల్వ సామర్థ్యం పెరిగింది. మండల కేంద్రంలోని భాస్కర్‌రావు చెరువు పూర్తి స్థాయిలో నిండడంతో దాని చుట్టుపక్కల ప్రాంతాల్లోని బోర్లు, బావుల్లో సైతం భూగర్భ జలాలు పుష్కలంగా ఉండడంతో రైతులు యాసంగిలో కూడా వరి సాగు చేస్తున్నారు. ఇప్పటి వరకు సుమారు 1500 ఎకరాల్లో వరి సాగైంది. ముందుగా నారు పోసుకున్న రైతులు ప్రస్తుతం నాట్లు పెడుతున్నారు. మరి కొందరు రైతులు పొలాలను దమ్ము చేసే పనిలో బిజీగా ఉన్నారు. ఇప్పటికే నాట్లు పెట్టిన రైతులు సస్యరక్షణ చర్యలు చేపడుతున్నారు.

అగస్తేశ్వరుడికి అన్నాభిషేకం

దామరచర్ల, డిసెంబర్ 9 : మండలంలోని వాడపల్లి మీనాక్షీ అగస్తేశ్వరస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్తికమాసం ఏకాదశి తిథిని పురస్కరించుకొని ఆలయంలో స్వామివారికి పంచామృత అభిషేకాలు చేపట్టారు. అనంతరం ఆలయ అర్చకులు నాగేంద్రశర్మ, సాంబశివశర్మ, తరుణ్ అన్నాభిషేకం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.

ఘనంగా అయ్యప్ప మహా పడిపూజ

అయ్యప్ప మహాపడిపూజలో పాల్గొన్న మాలధారులు

భువనగిరి అర్బన్, డిసెంబర్ 9 : పట్టణంలోని పచ్చలకట్ట సోమేశ్వర ఆలయంలో శనివారం అయ్యప్ప మహా పడిపూజను నిర్వహించారు. గణపతి హోమంతో పాటు అయ్యప్ప స్వామికి నవాభిషేకాలు పంచామృత అభిషేకాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కాలేరు లక్ష్మణరావు, ఆలయ ప్రధాన పూజారి కప్పగంతుల నాగరాజ్‌శర్మ, గురుస్వామి సాధు ఉపేందర్, శ్రీనివాస్‌గుప్తా, నరసింహచారి పాల్గొన్నారు.

ఆత్మకూరు(ఎం) : మండల కేంద్రంలోని జడ్పీహెచ్‌ఎస్‌లో శనివారం గురుస్వామి దాచ రమేశ్‌గుప్తా ఆధ్వర్యంలో 18వ అయ్యప్పస్వామి పడిపూజ నిర్వహించారు. హైదరాబాద్‌కు చెందిన గురుస్వామి మహేశ్ అయ్యప్ప పాటలతో ప్రత్యేక పూజలు జరిపారు. కార్యక్రమంలో మాలాధారులు వెంకన్న, పాండు, నవీన్, అంజయ్య, గణేశ్ పాల్గొన్నారు.

నమ్మించి.. నగదును దొంగలించారు

నార్కట్‌పల్లి, డిసెంబర్ 9: బ్యాంకులో నగదును డ్రా చేసుకొని వెళుతున్న వ్యక్తిని నమ్మించి నగదును దొంగిలించిన సంఘటన పట్టణ కేంద్రంలో శనివారం చోటుచేసుకుంది. ఎస్సై సైదాబాబు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని చిన్నతుమ్మలగూడెం ఆవులోని బావికి చెందిన కన్నెబోయిన యాదయ్య శుక్రవారం ఎస్‌బీఐ బ్యాంకులో తన ధాన్యం డబ్బులు రూ.2.25లక్షల డ్రా చేసుకొని ఒక కవర్‌లో పెట్టుకున్నాడు. గుర్తుతెలియని ముగ్గురు వ్యక్తులు అతని వద్దకు వెళ్లి అతని షర్టు, దోతిపై ఉమ్మివేసి ఎవరో నీ వెనుక ఉమ్మి వేశారని కడుకొమ్మని అతని దృష్టి మరల్చారు. అందులో ఒకరు నార్కట్‌పల్లి బేకరి షాపు వద్దకు వెళ్లగా అక్కడ అతనికి నీళ్లు ఇచ్చి కడుక్కోమన్నారు. అతను ఆ డబ్బుల కవర్‌ను ఒక కుర్చీ మీద పెట్టి కడుక్కునే సమయంలో మోసపూరితంగా రూ. 2.25లక్షలు ఉన్న కవర్‌ను తీసుకొని పారిపోయారు. దీంతో కన్నెబోయిన యాదయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం

- మహాలక్ష్మి పథకాన్ని ప్రారంభించిన అదనపు కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్

నల్లగొండలో మహిళలకు ఫ్రీ జర్నీని ప్రారంభిస్తున్న అదనపు కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్

నల్లగొండ సిటీ, డిసెంబర్ 9: మహాలక్ష్మి పథకంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించే అవకాశం కల్పించింది. ఈ పథకాన్ని శనివారం నల్లగొండ డిపోలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆర్టీసీ రీజినల్ మేనేజర్ శ్రీదేవి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ఎక్కడి నుంచి ఎక్కడికైనా ఆర్టీసీ బస్సుల్లో మహిళలు ఉచితంగా ప్రయాణించవచ్చన్నారు. కార్యక్రమంలో నల్లగొండ డిపో మేనేజర్ రామ్మోహన్‌రెడ్డి, డీఎంఓ మాధవి, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నార్కట్‌పల్లిలో ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వేముల వీరేశం

మిర్యాలగూడ డిపోలో ..

మిర్యాలగూడటౌన్: మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించే పథకాన్ని మిర్యాలగూడ డిపోలో ఏడీఏ పోరెడ్డి నాగమణి, డీఎస్పీ వెంకటగిరి, ఆర్టీసీ డిపోమేనేజర్ పాల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఎం పాల్ మాట్లాడుతూ మహిళలు, విద్యార్థినులు, ట్రాన్స్‌జెండర్లకు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించే అవకాశం కల్పించినట్లు తెలిపారు. అనంతరం మిర్యాలగూడ నుంచి నల్లగొండకు వెళ్లే పల్లెవెలుగు బస్సులో మహిళలకు జీరో టికెట్ అందించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ అనిత, మాజీ కౌన్సిలర్ శ్రీనివాస్, టుటౌన్ సీఐ నరసింహారావు, ఎస్ఐలు, ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

నార్కట్‌పల్లి డిపోలో

నార్కట్‌పల్లి : ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని శనివారం నార్కట్‌పల్లి డిపోలో నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం ప్రారంభించారు. ప్రత్యేకంగా మహిళలతో కూడిన బస్సును ఆయన జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం డిపో అధికారులు ఎమ్మెల్యేను సన్మానించారు. కార్యక్రమంలో వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

హాలియా : స్థానిక బస్టాండ్‌లో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు కుందూరు వెంకట్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు కాకునూరి నారాయణగౌడ్, మల్గిరెడ్డి లింగారెడ్డి, వెంపటి శ్రీనివాస్, రావుల రాంబాబు పాల్గొన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

అడవిదేవులపల్లి, డిసెంబర్ 9 : తాళం వేసిన ఇంట్లో దొంగలు చొరబడి చోరీకి పాల్పడిన ఘటన మండల కేంద్రంలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన మాడిశెట్టి వాసుదేవాయి కుటుంబసభ్యులతో కలిసి మండలంలోని ముదిమాణిక్యం గ్రామానికి వెళ్లారు. రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి తాళం పగులగొట్టి లోనికి ప్రవేశించారు. ఇంట్లోని బీరువాలో ఉన్న బంగారు నగలను ఎత్తెకెళ్లారు. శనివారం ఇంటికి వచ్చిన వాసుదేవాయి తన ఇంట్లో చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ హరిబాబు ఇంటిని పరిశీలించారు. క్లూస్ టీంతో ఆధారాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

ప్రపంచ తెలుగు సాహిత్య కళా ఉత్సవ్‌కు వేములపల్లి కళాకారుడు

వల్లంపట్ల అబ్రహం

వేములపల్లి, డిసెంబర్ 9: ఈ నెల 16, 17 తేదీల్లో ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రం తాడేపల్లిగూడెంలో శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో నిర్వహించే ప్రపంచ తెలుగు సాహిత్య కళా ఉత్సవ్‌కు మండలంలోని ఆమనగల్లు గ్రామానికి చెందిన జానపద కళాకారుడు వల్లంపట్ల అబ్రహం పాల్గొననున్నారు. ఈ మేరకు ఆయనకు శనివారం ఆహ్వానం అందింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో తాను చదువు వెలుగు జిల్లా డైరెక్టర్‌గా పని చేసిన సందర్భంలో ఊరూరా పాటలు పాడుతూ వయోజన విద్యపై ప్రజలకు అవగాహన కల్పించినట్లు చెప్పారు. 30 గంటల పాటు నిరవధికంగా నిర్వహించే తెలుగు సాహిత్య కళా ఉత్సవాలకు తనను ఎంపిక చేయడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు.

పోటీల్లో భాగంగా యోగాసనాలు వేస్తున్న బాలికలు

బీసీ బాలికల గురుకులంలో రాష్ట్రస్థాయి యోగా పోటీలు

మిర్యాలగూడ రూరల్, డిసెంబర్9 : మండలంలోని శ్రీనివాస్‌నగర్‌లో ఉన్న దామరచర్ల బీసీ బాలికల గురుకుల పాఠశాలలో రాష్ట్ర స్థాయి యోగా పోటీలను శనివారం పాఠశాల ప్రిన్సిపాల్ కొండకింది నర్సింహారెడ్డి ప్రారంభించారు. ఈ పోటీలకు రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి 120 మంది యోగా క్రీడాకారులు పాల్గొన్నారు. కార్యక్రమంలో అండర్ – 19 ఎస్‌జీఎఫ్ కార్యదర్శి ఇందిర, యోగా శిక్షకులు సతీశ్, నర్సిరెడ్డి, యుగేంధర్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, ధర్మేందర్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, నాగార్జున పాల్గొన్నారు.

తాతా, నాన్నలే ఆదర్శంగా అభివృద్ధి

- ఎస్ఎల్‌బీసీ కాల్వను 9 కిలోమీటర్లు పొడిగిస్తా : జైవీర్‌రెడ్డి

హైదరాబాద్, డిసెంబర్ 9 (నమస్తే తెలంగాణ) : నాగార్జున సాగర్ ఎమ్మెల్యేగా ప్రజలు మెచ్చే పాలన చేస్తానని తన తాత, నాన్నలే ఆదర్శంగా అభివృద్ధిని కొనసాగిస్తానని ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి తెలిపారు. తన గెలుపునకు సహకరించిన సాగర్ ప్రజలకు, అవకాశం ఇచ్చిన ఏఐసీసీ పెద్దలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. తన తండ్రి జానారెడ్డి అడుగుజాడల్లో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని చెప్పారు.

ఇసుక బస్తాలు వేసి నీటి వృథాకు అడ్డుకట్ట వేస్తున్న ఆయకట్టు రైతులు

ఆయకట్టు రైతుల శ్రమదానం

- రాచలకాల్వలో జాలకుంట వద్ద ఇసుక బస్తాలు వేసి నీటి వృథాకు అడ్డుకట్ట

శాలిగౌరారం, డిసెంబర్ 9: శాలిగౌరారం ప్రాజెక్టులోకి నీరువచ్చే ప్రయాణ మార్గంలోని రాచలకాల్వలో జాలకుంట వద్ద వృథాగా పోతున్న నీటిని ఆయకట్టు రైతులు శ్రమదానం చేసి అడ్డుకట్ట వేశారు. రామగిరి, శాలిలింగో టం, గురజాలకు చెందిన రైతులు రాచకాల్వ వెంట బయలుదేరి వెళ్లి వృథాగా పోతున్న షట్టర్ల వద్ద ఇసుక బస్తాలు వేశారు. దీంతో నీటి వృథా ఆగిపో యింది. నీటిపారుదల శాఖ ఏఈ రాములు, రామగిరికి చెందిన రైతు ప్రతినిధి చామల వెంకటరమణారెడ్డి అధ్వర్యంలో రాచకాల్వలో శ్రమదానం చేశారు. దీంతో నీరు సాఫీగా ప్రాజెక్టులోకి చేరుతోంది. రైతులు అంజయ్య, శ్రీను, నర్సింహ, యాద య్య, దీటికుమార్, నాగరాజు, గణేశ్, రవి, నర్సయ్య, శంకర్ మరికొంత మంది శ్రమదానం చేశారు.